కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో...
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :95 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 28-07-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## సీఎం రేవంత్ ఢిల్లీ పయనం..కేబినెట్ విస్తరణపై మళ్లీ ఊహాగానాలు !

హైదరాబాద్,సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లారు. . రేవంత్ తాజా ఢిల్లీ పర్యటన.. 74వ పర్యాయం కావడం విశేషం. సోమవారం ఢిల్లీలో ఖర్గే అధ్యక్షతన జరిగే ఏఐసీసీ సమావేశంలో పాల్గొననున్నారు 'సర్' ప్రక్రియ, పార్టీ వ్యవహారాలతో పాటు ఇటీవల ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే కార్యాచరణపై చర్చించే అవకాశాలున్నట్టు సమాచారం. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, రాష్ట్ర పాలనాపరమైనా అంశాలు, జాతీయ స్థాయిలో పార్టీ అనుసరించాల్సిన కొత్త వ్యూహాలపై ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి పార్టీ అధిష్టానంతో చర్చలు జరపనున్నారు.

చట్టసభలకు పోటీకి వయోపరిమితి కుదింపు ప్రతిపాదనపై కీలక చర్చలు

సీఎం రేవంత్ రెడ్డి యువతను కాంగ్రెస్ కు దగ్గర చేసే వ్యూహంలో భాగంగా కొత్తగా తెరపైకి తెచ్చిన ప్రతిపాదన..ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేయడానికి వయో పరిమితిని ప్రస్తుతం ఉన్న 25 సంవత్సరాల 21 ఏళ్లకు తగ్గించడంకు సంబంధించి పార్టీ హైకమాండ్ తో చర్చించనున్నట్లుగా సమాచారం. 'యువత రాజకీయ ప్రవేశం'.. చట్టసభల్లో యువతకు మరింత ప్రాధాన్యత కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ నూతన ప్రతిపాదనకు తోడుగా ఆయన "జై జవాన్, జై కిసాన్, జై యువ" అనే సరికొత్త నినాదాన్ని ఆయన తెరపైకి తెచ్చారు. ఈ ప్రతిపాదనలపై నేటి ఢిల్లీ పర్యటనలో రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ స్వయంగా చర్చించనున్నారు. తన ప్రతిపాదనలపై ఇండియా కూటమి నేతలతోనూ చర్చించాలని ఆయన రాహుల్ గాంధీని కోరనున్నట్లుగా తెలుస్తుంది.

కేబినెట్ విస్తరణపై చర్చలకు అవకాశం ?

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలకు సంబంధించి కూడా ఈ పర్యటన అత్యంత ప్రాధాన్యమైనదిగా పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పీసీసీ చీఫ్ మహేశ్



కుమార్ గౌడ్ కూడా సీఎంతో పాటు పార్టీ హైకమాండ్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. గత కొద్ది నెలలుగా పెండింగ్‌లో ఉన్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకాలపై ఏఐసీసీ పెద్దలతో చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలు కూడా అధిష్ఠానం సమక్షంలో చర్చకు రానున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్ లో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. రెండు ఖాళీలను భర్తీ చేయడంతో పాటు కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ చేయాలని ఎప్పటినుంచో సీఎం రేవంత్ ఆలోచన చేస్తున్నారు. అయితే అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ వాయిదా పడుతుంది. ఈ దఫా ఢిల్లీ పర్యటనలోనూ ఈ అంశంపై స్పష్టంగానే కనిపిస్తుంది. పార్లమెంటు సమావేశాల్లో బిజీగా ఉన్న రాహుల్, ఖర్గేలు కేబినెట్ విస్తరణ కసరత్తుపై చర్చించేంత సమయం చిక్కకపోవచ్చునిరాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## మీ దొంగ ప్రచారాలు,నాటకాలు ఆపండి.. మంత్రి వాకిటి శ్రీహరి ఫైర్!




హైదరాబాద్, పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించి "కర్ణాటకలో నీళ్లు – తెలంగాణలో బీళ్లు" అంటూ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమే తప్ప, పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం కాదని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిందని చెప్పుకునే వారు, బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో కర్ణాటకలో ఆనకట్టలు నిర్మించినప్పుడు ఒక్కసారి కూడా వెళ్లి ప్రశ్నించలేదని ఆయన అన్నారు. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

డీపీఆర్‌లు సిద్ధం..

జూరాల ప్రాజెక్టు పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. భీమా, కృష్ణా నదులపై బ్యారేజ్–కమ్–బ్రిడ్జిల నిర్మాణం ద్వారా నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే ఆలోచన కూడా గత ప్రభుత్వానికి రాలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని, కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజ్–కమ్–బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధం చేశామని మంత్రి తెలిపారు.

మంత్రి ఆవేదన వ్యక్తం..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కే. శివకుమార్, కర్ణాటక సాగునీటి శాఖ మంత్రులతో కలిసి హెలికాప్టర్ ద్వారా ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించి, సాంకేతికంగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. జూరాల ముంపు గ్రామాలైన భూత్పూర్, నేడుగం, అనుగొండ, అంకెనపల్లి, దాదంపల్లి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దకాలంగా ముంపు గ్రామాల ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, తగిన నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.

అసత్య ప్రచారాలు..

పాలమూరు ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడం వల్ల ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రైతులు, యువత అన్ని విషయాలు గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు విరమించుకోవాలని మాజీ ప్రజాప్రతినిధులకు సూచించారు. "మంచి చేయలేకపోయినా కనీసం చెడు చేయకండి. ప్రజలను మోసం చేసే రాజకీయాలు మానుకోండి. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం మా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది" అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

## పర్యవేక్షణతో నాణ్యమైన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



ఖమ్మం, ఖమ్మం నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగర పాలక సంస్థ 43వ డివిజన్‌లో రూ. 61. 50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించి, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఖమ్మం నగర అభివృద్ధికి ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యానికి ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భారీ వర్షాల హెచ్చరిక.. ఐటీ కంపెనీలకు కీలక సూచన..

హైదరాబాద్,తెలంగాణ వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ. ఈ నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఈ క్రమంలో ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు ముందస్తు లాగౌట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల హెచ్చరిక– తెలంగాణ వ్యాప్తంగా జూలై 27 నుంచి ఆగష్టు ఒకటి వరకు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనికితోడు హైదరాబాద్ సిటీలో అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్షాలు పడ్డాయి. ప్రస్తుతం వాతావరణ కూడా వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అలర్టయిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. ఐటీ కంపెనీలకు కీలక సూచన– సోమవారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించారు. ఈ క్రమంలో వాహనాల రద్దీ ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఐటీ కంపెనీలతో పాటు ఇతర సంస్థల ఉద్యోగులకు ముందస్తు లాగౌట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు పోలీసులు. అడ్వైజరీ జారీ చేసిన సైబరాబాద్ పోలీసులు– ఈ విషయంలో కంపెనీలు లేదా సంస్థలు ఉద్యోగుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా సంస్థలు సహకరించాలని సూచన చేశారు. అలాగే లోకేషన్, లాగౌట్ సమయాలను



తమకు తెలియాలని తెలిపారు. దీనివల్ల ప్రయాణ సంబంధిత ప్రమాదాలను తగ్గించడమే కాదు రహదారి మౌలిక సదుపాయాలపై ఒత్తిడిని తగ్గుతుందని తెలిపింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో నిత్యావసర సేవలు సజావుగా సాగేందుకు తోడ్పడుతుందని తెలిపారు. వర్షాలు పడినా అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సలహా జారీ చేస్తున్నట్లు తెలిపారు పోలీసులు. వర్షాల సమయంలో ట్రాఫిక్ నిర్వహణకు సంస్థలు సహకరించాలని అందులో ప్రస్తావించారు. అవసరమైతే ప్రజలు కూడా ప్రయాణాలు చేయాలని కోరారు.

## లోతుకుంట భూ వ్యవహారం.. హైకోర్టుకు హైడ్రా చీఫ్ క్షమాపణలు

హైదరాబాద్,హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలంగాణ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తూ బేషరతుగా క్షమాపణలు తెలియజేశారు. కోర్టులు, దేశ న్యాయ వ్యవస్థపై తమకు ఎంతో నమ్మకం, అత్యున్నత గౌరవం ఉన్నాయని అందులో పేర్కొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్ 1, 2లలో ఉన్న 40 ఎకరాల భూమిలోకి హైడ్రా సిబ్బంది ప్రవేశించలేదని, అక్కడ ఎలాంటి కూల్చివేతలు లేదా ఇతర చర్యలు చేపట్టలేదని స్పష్టం చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చి, అబద్ధ కథనాలు కల్పించి పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. న్యాయస్థానాల పట్ల తమకు ఉన్న గౌరవాన్ని చాటుతూ, ఇప్పటివరకు జరిగిన పరిణామాలకు గాను బేషరతుగా క్షమాపణలు కోరుతున్నట్లుగా పేర్కొన్నారు.

ఇన్ని కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు?

ఈ విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం రంగనాథ్ తీరుపై పలు కీలక వ్యాఖ్యలు చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై ఇప్పటి వరకు దాదాపు 63 కోర్టు ధిక్కరణ (Contempt of Court) పిటిషన్లు దాఖలయ్యాయని ధర్మాసనం



గుర్తుచేసింది. 'ఒకే ఒక్క అధికారిపై, ఇన్ని కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు వస్తున్నాయి? నిబంధనలను పాటించకుండా, కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పక్కనబెట్టి వ్యవహరించడం వల్లే కదా ఇన్ని పిటిషన్లు దాఖలవుతున్నాయి?' అని ధర్మాసనం రంగనాథ్‌ను, ప్రభుత్వ న్యాయవాదిని సూటిగా ప్రశ్నించింది.

## పేపర్ లీక్‌లపై కేంద్రం కొత్త బిల్లు.. 10 ఏళ్ల జైలు.. రూ.10 కోట్ల జరిమానా..!

న్యూఢిల్లీ, పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. సోమవారం (జూలై 27) లోక్‌సభలో కీలక బిల్లును ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా నీట్ సహా పలు పోటీ పరీక్షల్లో పేపర్ లీక్ ఘటనలు తీవ్ర ఆందోళనల నేపథ్యంలో 2024 ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ముందుకు తెచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం మేరకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. సభలో విపక్షాల ఆందోళనల మధ్య యాంటీ పేపర్ లీక్ బిల్లు ప్రవేశపెట్టగా దీనిపై సభ్యుల సూచనలు స్వీకరించి చర్చ నిర్వహిస్తామని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అయితే, ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని చర్చను ఇతర అంశాలతో మళ్లించవద్దని ఆయన సూచించారు.

సవరణ బిల్లును వ్యతిరేకించిన విపక్షాలు :

కానీ, ప్రతిపక్షాలు మాత్రం ఈ సవరణ బిల్లును తీవ్రంగా విమర్శించాయి. ఈ బిల్లు అనేది శాశ్వత పరిష్కారం కాదని ఆరోపించాయి. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో జరిగిన లాఠీచార్జిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. పేపర్ లీక్ ఘటనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయం కూడా చర్చకు వచ్చింది. ఈ కొత్త పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు 2026 ప్రకారం.. ఇక పేపర్ లీక్ కేసులపై దర్యాప్తు రెండు నెలల్లోగా పూర్తి చేయాలి. పరీక్షలలో పేపర్ లీక్‌లు లేదా అక్రమ పద్ధతులకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధించాలని ఈ బిల్లులో పేర్కొన్నారు.




సంఘటిత నేరాలకు కనీసం ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకు జరిమానా పడుతుంది.

## కేబినెట్ లో యువ మంత్రులను చూడాలనుకుంటున్నారు



హైదరాబాద్,తెలంగాణ కేబినెట్ లో ప్రజలు కొత్త మంత్రులను, ముఖ్యంగా యువ మంత్రులను చూడాలని అనుకుంటున్నారని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా జెన్ జీ యువతరం నేపథ్యంలో తనలాంటి యువ ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం కల్పిస్తే బాగుంటుందన్నది నా వ్యక్తిగత అభిప్రాయం అని అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇంజనీర్లు, డాక్టర్ వంటి ఉన్నత చదువులు చదువుకున్న తన లాంటి యువ ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో అవకాశం ఇవ్వాలని కోరుకోవడంలో తప్పులేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు పూర్తయిన నేపథ్యంలో మంత్రివర్గంలో యువ నేతలను మంత్రులుగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని, మీడియాలో సైతం ఎక్కువగా ఇదే అభిప్రాయం వినిపిస్తుందన్నారు. ఎక్కువ మంది సీనియర్లతో కూడిన రాష్ట్ర కేబినెట్ కు రెండున్నరేళ్ల పదవీ కాలం ముగిసిపోయిందని, మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు అసరమన్న అభిప్రాయం బలంగా వ్యక్తం అవుతుందని అనిరుధ్ రెడ్డి అన్నారు. ఎవరి అభిప్రాయాలు ఎలా ఉన్నా..పార్టీలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్, పార్టీ ఇంచార్జ్, ఢిల్లీ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని, అంతా వారి నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ ఊహగానాల నేపథ్యంలో అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి.



## సంపాదకీయం

**మంగళవారం 28-07-2026**

# కాంగ్రెస్ పార్టీకి నీట్ బూస్ట్

జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్‌ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదుటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీకి వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీల స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్దిష్టంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందిన నాయకుడిగా ఇప్పటిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా దూకుడుగా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు.'దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# మోడీ జీ.. ఇది జెన్ జీ!




న్యూఢిల్లీ,ప్రస్తుతానికి పరిస్థితి సద్దుమణిగింది. రెండు మాసాలుగా ఈ దేశ విద్యార్థి యువజనులు చేస్తున్న ఆందోళనకు ఎట్టకేలకు కేంద్రప్రభుత్వం తలవంచక తప్పలేదు. ఆ మేరకు శనివారంనాడు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దేశంలో పరీక్షా పత్రాల లీకేజీకి, విద్యావ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, ఏర్పడి ఉన్న గందరగోళానికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా సమర్పించారు. ఇది భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పుణ్యమా అని ఏర్పడిన కాక్రోచ్ జనతా పార్టీ సాధించిన తొలి విజయం. ఈ పార్టీ దేశంలో రాజకీయాల్ని సరి చేయడానికో, అధికారంలోకి వచ్చి దేశ పరిస్థితులను చక్కదిద్దడానికో ఏర్పడింది కాదు. ఈ దేశంలోని విద్యార్థులు, యువకులు సరైన విద్య అందక, ఉపాధి అవకాశాలు లేక కొట్టుమిట్టాడుతున్న స్థితిలో వారిని అవమానించే విధంగా దేశ ప్రధాన న్యాయమూర్తి వారిని ఉద్దేశించి బొద్దింకలు, పరాన్నజీవులు అని చేసిన వ్యాఖ్యల పర్యవసానంగా ఒక వ్యంగ్య వ్యక్తీకరణగా ఏర్పడింది కాక్రోచ్ జనతా పార్టీ. అది ఇంతింతై వటుడింతై అన్నచందంగా ఏర్పడిన కొద్ది మాసాల్లోనే ఈ దేశంలో ఇక మాకు తిరుగులేదు అంటూ మూడవసారి అధికారంలోకి వచ్చిన కారణంగా అతి విశ్వాసంలో పడిన కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేట్టు చేసి భారత ప్రజాస్వామ్యం ఎంత బలమైనదో స్పష్టం చేసింది.ప్రభుత్వాలు ఏర్పడేది దేశ ప్రజలకు సుపరిపాలన అందించడానికి, తప్పులు జరగకుండా చూడటానికి. వీళ్ళు ప్రజలకోసం పనిచేసే ధర్మకర్తలు. ఎక్కడైనా తప్పులు జరిగితే ప్రజలు అడిగేదాకా ఆగకుండా వాటిని సరి చేసుకోవలసిన బాధ్యతగలవారు. అంతేగాని అధికారంలో ఉన్నాం కాబట్టి మేము ఏం చేయడానికైనా ప్రజలు మాకు ఓటు ద్వారా ఆమోదముద్ర వేశారని అనుకుంటే పప్పులో కాలేసినట్టే. తన శాఖలో తప్పులు జరిగితే తాను ప్రత్యక్షంగా బాధ్యుడు కాకపోయినా పదవికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం స్వతంత్ర భారతదేశంలో కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కేవలం 9 సంవత్సరాలలో 1956లో అప్పటి రైల్వే శాఖ మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి తన తప్పు లేకపోయినా ఒక రైలు ప్రమాదంలో 150 మంది మరణించినందుకు నైతిక బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసిన విషయం గుర్తు చేసుకోవాలి. ఆ తర్వాత కూడా ఇటువంటి సందర్భాలు కొన్ని మనం చూసాం. 1958లో అప్పటి ఆర్థికమంత్రి టిటి కృష్ణమాచారి ప్రజల నుండి, రాజకీయ పక్షాలనుండి వచ్చిన ఒత్తిడి కారణంగా ముద్రా స్కాండల్ అనే ఒక బీమా పెట్టుబడుల కుంభకోణానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. 1962లో భారత్– చైనా యుద్ధకాలంలో భారతదేశపు సైనిక సన్నద్ధత మీద వచ్చిన విమర్శల కారణంగా ఆనాటి రక్షణ మంత్రి వికె కృష్ణ మీనన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. తర్వాత కాలంలో ముంబై ఉగ్రవాద దాడుల నేపథ్యంలో 2008లో కేంద్ర హోం మంత్రిగా ఉన్న శివరాజ్ పాటిల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అలాగే 1992లో మాధవరావు సింధియా, 1999లో నితీష్ కుమార్, 2017లో సురేష్ ప్రభు ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. 2018లో ప్రముఖ సంపాదకుడు, ఎన్ డీఏ ప్రభుత్వంలో విదేశీ వ్యవహారాల మంత్రిగా ఉన్న ఎంజే అక్బర్ కూడా మరో భిన్నమయిన కారణం వల్ల రాజీనామా చెయ్యక తప్పలేదు. 'మీ టూ' ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో లైంగిక వేధింపుల ఆరోపణల కారణంగా ఆయన ఈ రాజీనామా చేసారు. ఇలా రాజీనామాలు చేసిన వాళ్లంతా వ్యక్తిగతంగా తప్పులు చేశారని, అవినీతిపరులని అనుకోవాల్సిన పనిలేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు కానీ, ప్రభుత్వానికి బాకాగా మారిన ఒక వర్గం గోదీ మీడియా కానీ ప్రారంభించిన స్తోత్రపాఠాలు విన్నాక ఈ సంఘటనలన్నీ గుర్తు చేయాల్సి వచ్చింది.ప్రజలు తమను ఎన్నుకొని పరిపాలించమని జీతభత్యాలు ఇచ్చి నియమించుకున్నప్పుడు ఆ ఉద్యోగం సక్రమంగా చేయలేనివారు స్వచ్ఛందంగా తొలగిపోవాలి. కాదు కూడదని భీష్మించుకు కూర్చుంటే కాక్రోచ్ లు జంతర్ మంతర్ దగ్గర చేసిన ఆందోళన.. దేశం నలుమూలలా స్ఫూర్తిగా నిలిచి యువతను, విద్యార్థి లోకాన్ని రోడ్ల మీదకు తెచ్చి ఈ పరిస్థితి కల్పిస్తుంది. ఆందోళనకారులు అడిగింది కేవలం జవాబుదారీతనం మాత్రమే. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను మహానుభావుడు లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామాతో పోల్చడం ఎంతమాత్రం సమంజసం కాదు. తాను ప్రత్యక్షంగా బాధ్యుడు కాకపోయినా అంతమంది మరణం మనోవేదన కలిగించి ఎవరూ అడగకుండానే శాస్త్రి రాజీనామా చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ దగ్గరికి వచ్చేసరికి ఢిల్లీ పీఠం కదిలే దిశగా భయంకరమైన ప్రకంపనలు ఏర్పడి అసలుకే ఎసరు వచ్చేట్టు ఉందన్న సూచనలు స్పష్టంగా కనిపించాక కానీ రాజీనామా చేయలేదు. 2017లో లలిత్ మోడీ వ్యవహారం సందర్భంగా కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ చేసిన ప్రకటనను గుర్తు చేసుకోవాలి. 'డిమాండ్ చేయగానే మంత్రులచేత రాజీనామాలు చేయించడానికి ఇది యూపీఏ ప్రభుత్వం కాదు.. ఎన్ డి ఏ. ప్రతిపక్షాలు డిమాండ్ చేసినంత మాత్రాన మంత్రులతో రాజీనామా చేయించడం, తీసేయడం జరగదు. అవకతవకలు, అక్రమాలు జరిగితే దర్యాప్తు చేయిస్తాం అంతే' అన్నారాయన ఆ రోజుల్లో.ఇప్పుడు కూడా పీఠం కిందికి నీళ్లు వచ్చే పరిస్థితి ఏర్పడిన కారణంగానే కేంద్రం దిగి వచ్చిందనేది స్పష్టం. సామాజిక మాధ్యమం అయిన ట్విట్టర్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా ఆందోళనకారులను 'మిత్రులారా' అని సంబోధిస్తూ వారిని సముదాయించడం కోసం చివరి ప్రయత్నంగా పెట్టిన రెండు వీడియోలు చూసినప్పుడే ప్రభుత్వం ఆందోళనలో పడిందన్న విషయం అర్థమైంది.ప్రధాన డిమాండ్ నెరవేరింది.. మరో రెండు డిమాండ్ల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయకుండా ఉద్యమకారుల మీద, ముఖ్యంగా జులై 20వ తేదీన జంతర్ మంతర్ దగ్గర జరిగిన ఆందోళన సందర్భంగా పోలీసులు పెట్టిన కేసులు బేషరతుగా ఉపసంహరించుకోవడం, నీట్ పరీక్షపత్రాల లీకేజీ కారణంగా మనోవేదనతో మరణించిన వారి కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించడం జాప్యం లేకుండా చేస్తే మంచిది.తమకు నష్టం జరిగినప్పుడు ఈ దేశ విద్యార్థి యువజనులు ఎలా వీధుల్లోకి వస్తారో, పోరాడి తమ సమస్యని ఎలా పరిష్కరించుకుంటారో ప్రస్తుతం కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు దేశంలో జరిగిన ఆందోళనలన్నీ నిదర్శనంగా నిలుస్తాయి. అందుకే తమకు తిరుగులేదని ఎవరూ భావించకూడదు. తాడిని తన్నేవాడి తల తన్నేవాడుంటాడని ఒక పాత సామెత. అయినా ఈ విషయం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఎవరూ గుర్తు చేయాల్సిన అవసరం లేదు. ఇది వారికి తొలి అనుభవం ఏమీ కాదు. రెండవసారి ఎదురైన ఈ అనుభవం నుంచైనా మళ్లీ ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకుంటారా అన్నది ప్రశ్న. 2021 నవంబర్లో ఆయన వ్యవసాయానికి సంబంధించిన మూడు వివాదాస్పద చట్టాలను ప్రజాగ్రహానికి, ముఖ్యంగా రైతుల మహా నిరసనకు వెరచి ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. దేశ రాజధాని ఢిల్లీ శివార్లలో శిబిరాలు ఏర్పరచుకొని మరీ ఒక సంవత్సరంపాటు రైతులు సాగించిన చారిత్రాత్మక నిరసన మోదీ ప్రభుత్వం దిగి వచ్చేట్టు చేసింది.మన ప్రజాస్వామ్య సౌధాన్ని పదిలంగా నిలిపే నాలుగు స్తంభాలలో శాసన వ్యవస్థ గురించి ఇప్పటిదాకా మాట్లాడుకున్నాం. కార్యనిర్వాహకవర్గం విషయానికొస్తే రాజకీయ నాయకత్వం చెప్పుచేతల్లో నడిచే స్థితికి దిగజారినప్పుడే ఆ స్తంభం బీటలు వారింది. ఎంతోకాలంగా మనం చూస్తున్న ఈ పరిస్థితి ప్రస్తుతం దేశ విద్యార్థి, యువజన సమూహాలు చేస్తున్న న్యాయమైన శాంతియుత ఆందోళనలపట్ల వ్యవహరిస్తున్నతీరు మరో ఉదాహరణ మాత్రమే. ఢిల్లీ జంతర్ మంతర్ లో కానీ, మరో రాష్ట్రంలో కానీ అధికార యంత్రాంగం ముఖ్యంగా పోలీసు వ్యవస్థ రాజకీయ నాయకత్వ ఆదేశాలను అనుసరించి చేసిన దాష్టీకం చూసాం. వాటన్నిటిని బట్టబయలు చేసిన, పౌరుల పట్ల బాధ్యత ఎరిగిన సామాజిక మాధ్యమాలన్నిటికీ అభినందనలు. ఇక మూడవది న్యాయవ్యవస్థ. 'న్యాయవ్యవస్థ గనుక జోక్యం చేసుకోకపోతే రాజకీయ నాయకుల ఆమోదం, ఆదేశాలతో పోలీసులు తమకు లైసెన్స్ వచ్చినట్టుగా భావించి ఏమైనా చేసేయగలరు' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎదుట సీనియర్ అడ్వకేట్ గోపాల శంకర్ నారాయణ మొరపెట్టుకున్నారు. ఆ దాష్టీకం వీడియోలను చూడాల్సిందిగా మరో అడ్వకేట్ నరేంద్ర మిశ్రా చేసిన విజ్ఞప్తులను తోసిపుచ్చడమే కాకుండా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆ వీడియోలు చూసేంత సమయం తమకు లేదన్న వ్యాఖ్య చేసి మరొకసారి జెన్ జీ తరాన్ని దూరం చేసుకున్నారు. ఇంతకంటే దిగజారరు అనుకున్న ప్రతిసారీ ప్రజలను నిరాశపరిచేందుకు సిద్ధంగా ఉంటుంది నాలుగో స్తంభంలో భాగమయిన ఒక వర్గం మీడియా. ఉద్యమంపట్ల, ఉద్యమకారులపట్ల జనంలో అనుమానాలు కలిగించడానికి ఈ వర్గం చెయ్యని ప్రయత్నాలు లేవు. ఉద్యమకారులు అసలు విద్యార్థులే కాదన్నారు. విదేశీశక్తులు వాళ్ళ వెనకున్నాయని గంటల తరబడి గొంతులు చించుకున్నారు.విద్యార్థులు, యువజనులు ఏం అడిగారు? వాళ్ళేం అధికారం కోరలేదు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయమన్నారు. అక్కడి పరిస్థితుల్ని చక్కదిద్దమన్నారు. విద్య ఈ దేశ భవిష్యత్తు కదా అన్న ఒక్క ఆలోచన ప్రధాన న్యాయమూర్తి చేయలేకపోయారు. కాక్రోచ్ జనతా పార్టీ పుట్టుకకు కారణమైన ఆయన వ్యాఖ్యల దగ్గర నుండి

# లింక్డిన్ లో వైజాగ్ టాప్




విశాఖపట్టణం, ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది.లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది.అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు ప్రత్యేంగా, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నట్లుగా తేలింది. విశాఖలో ఐటీతో పాటుగా ఫార్మా, తయారీ రంగం, డేటా సెంటర్లు, పోర్టు వంటివి కీలకంగా మారాయి.ఇక రెండో స్థానంలో నిలిచిన లుధియానాలో ఉక్కు, విమానయానం, ఆతిథ్య రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. సూరత్ టెక్స్‌టైల్, వజ్రాలు, స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్ ద్వారా విస్తరిస్తోంది. వడోదరలో కెమికల్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులు వస్తున్నాయి. విజయవాడలో కూడా ఐటీ, ఈ–గవర్నెన్స్ కంపెనీల నుంచి ఆసక్తి పెరుగుతోంది. ఈ 10 నగరాల్లోనూ తొలి మూడు నియామకాల్లో ఐటీ సేవలు, టెక్నాలజీ, కన్సల్టింగ్ సర్వీసులు ఉన్నాయి. మిగతా నగరాల్లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఉన్నాయని లింక్డిన్ చెబుతోంది.

# జగన్ నెక్స్ట్ ప్లాన్...

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ పెద్దల తలుపులు ఆయన కోసం ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయన ఎప్పుడు దిల్లీ వెళ్లినా ప్రధాని, హోంమంత్రుల అపాయింట్‌మెంట్లు సులువుగా లభించేవి. కానీ, నేడు ఏపీలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమవ్వడమే కాకుండా, కేంద్రంలో ఏపీలోని కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు ఎన్డీఏ లో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ తరుణంలో జగన్ ఢిల్లీ మంత్రాంగం ఆయనకే రివర్స్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల సంయుక్త ఎన్డీఏ ప్రభుత్వం. ఒక రకంగా చెప్పాలంటే మోదీ, అమిత్ షాల నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కీలక భాగస్వాములు. ఇలాంటి సమయంలో, రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడానికి జగన్ వెళ్లి అదే ఎన్డీఏ పెద్దలను కలవాలని చూడటం రాజకీయంగా రివర్స్ అవుతుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన స్వంత కూటమి భాగస్వాములను పక్కనబెట్టి, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి ప్రాధాన్యత ఇస్తుందని భావించడం వ్యూహాత్మక అపరిపక్వతే అవుతుంది. కూటమి ప్రభుత్వంపై మోదీ, షాలకు ఫిర్యాదు చేసినా, దానికి ప్రాధాన్యత లభించకపోగా.. జగన్ రాజకీయంగా మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది.జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, అపాయింట్‌మెంట్ల ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాక్షేత్రంలో ఒక్కటే బలమైన ప్రచారం జరుగుతుంది. అదేమిటంటే.. ఆయనపై ఉన్న సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసులు, ఇతర విచారణల నుంచి ఉపశమనం పొందేందుకే ఆయన బీజేపీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారనే భావన. గత ఐదేళ్ల పాటు పార్లమెంట్‌లో ఎన్డీఏకి అవసరమైన ప్రతి బిల్లుకూ ముందూ వెనుక ఆలోచించకుండా బేషరతుగా మద్దతు ప్రకటించిన జగన్, ఇప్పుడు కూడా బీజేపీ గుడ్ లుక్స్ లో ఉండేందుకే తాపత్రయపడుతున్నారని భావిస్తున్నారు. ఈ తరహా పర్యటనలు ఆయన ప్రతిపక్ష నాయకుడిగా సాధించే ప్రజాదరణ కంటే, కేసుల భయంతోనే ఢిల్లీ పెద్దలకు నమస్కరిస్తున్నారు అనే ముద్రను మరింత బలపరుస్తాయి.ఒకపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని, బీజేపీతో కలిసున్న చంద్రబాబు–పవన్ జోడీని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ.. మరోపక్క అదే బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేయడం వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. పార్టీ శ్రేణులు రాష్ట్రంలో కూటమిపై పోరాడాలా లేక ఢిల్లీ స్థాయిలో సంధి ప్రయత్నాలు జరుగుతున్నాయని మౌనంగా ఉండాలా అనే సందిగ్ధంలో పడిపోతున్నాయి. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడి బలం పుంజుకోవాల్సిన సమయంలో, అధినేత పదేపదే ఢిల్లీ పెద్దల ఆశీస్సుల కోసం చూడటం పార్టీ సైద్ధాంతిక స్టాండ్‌నే ప్రశ్నించేలా చేస్తోంది. ఈ భేటీలు ఒకవేళ సాధ్యమైనా, జగన్ రాజకీయంగా సాధించేది ఏమీ ఉండదనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అంచనా. జగన్ ఇస్తే ఒకట్రెండు రాజ్యసభ ఓట్లు తప్ప, లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ బలం నామమాత్రంగా మారింది. అలాంటప్పుడు కేంద్ర పెద్దలు తమ కూటమి భాగస్వామి అయిన చంద్రబాబును కాదని జగన్‌కు రాజకీయ ప్రాధాన్యత లేదా ఊరట ఇస్తారనుకోవడం పొరపాటే. ఈ ప్రతిపాదన వల్ల కూటమి నేతలకు జగన్‌ను ఢిల్లీకి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడే నాయకుడు అని విమర్శించేందుకు అనువైన ఆయుధం దొరికినట్లవుతుంది.ఓ వైపు కేంద్రంపై వ్యతిరేకత పెరుగుతోందన్న వాతావరణం ఏర్పడుతోంది. ఢిల్లీలో కాక్రోచ్‌ల ఉద్యమం ఓ రేంజ్‌కు చేరుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో వైఎస్సార్‌సీపీకి అత్యంత అవసరమైనది ప్రజల్లో ఉండటం, అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్రను పటిష్టంగా పోషించడం. ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి హాజరు వేయించుకోవడం వల్ల లేదా వినతిపత్రాలు ఇవ్వడం వల్ల వచ్చే పొలిటికల్ మైలేజ్ శూన్యం. దానికి బదులుగా, ఆ పర్యటనలు తెచ్చే రాజకీయ ప్రతికూలత, పక్షపాత ముద్రలు పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తాయని ఎక్కువ మంది భావిస్తున్నారు. అయితే అపాయింట్మెంట్ లభిస్తే.. బయట ప్రచారం ఉన్నట్లుగా టీడీపీ కంటే ఎక్కువగా వైసీపీకే మోదీ ప్రాధాన్యం ఇస్తారని అనుకుంటారు. కానీ అది కూడా వైసీపీకి ఏ విధంగానూ మేలు చేయదు.

# పావురాలకు మేత వేయడంపై ఆంక్షలు

హైదరాబాద్,హైదరాబాద్, సికింద్రాబాద్ కవల నగరాల పరిధిలో పావురాలకు విచ్చలవిడిగా మేత వేయడం వల్ల ప్రజా ఆరోగ్యం, పర్యావరణం తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని తెలంగాణలో హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై స్పందించిన హైకోర్టు ధర్మాసనం మేత నియంత్రణకు తీసుకున్న చర్యలపై మూడు వారాల్లో సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జనావాసాలు, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల సమీపంలో పావురాలకు మేత వేయడాన్ని క్రమబద్ధీకరించాలని దాఖలైన ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఆగస్టు 25కి వాయిదా వేసింది. అయితే వాటికి మేత వేయటం వల్ల నష్టాలేంటి..? పావురాల అంత ప్రమాదకరమా..? ఆ విషయాలు తెలుసుకుందాం.హైదరాబాద్, సికింద్రాబాద్ నగర పరిధిలో విచ్చలవిడిగా పావురాలకు మేత వేయటంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పావురాల మేతను నియంత్రించడానికి, వాటి సంతతి పెరుగుదలను అరికట్టడానికి తీసుకున్న చర్యలపై మూడు వారాల్లోగా పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం (జులై 22) ఆదేశించింది. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాధేశ్యామ్ తపాడియా దాఖలు చేసిన ప్రజాహిత పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది దీపక్ మిశ్రా కోర్టుకు తన వాదనలు వినిపిస్తూ.. నివాస ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, రద్దీగా ఉండే పబ్లిక్ ప్రాంతాలు, చారిత్రక వారసత్వ కట్టడాల సమీపంలో ఎలాంటి నిబంధనలు లేకుండా పావురాలకు మేత వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల నగరంలో పావురాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయాని ఆందోళన వ్యక్తం చేశారు. పావురాల మేతను నియంత్రించడంలో, ఆరోగ్యం, పర్యావరణ ముప్పులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్ వాదించారు. అధికారుల తీరు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా పౌరులకు సంక్రమించిన జీవించే హక్కును కాలరాసేలా ఉందని ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.అనుమతి లేని ప్రదేశాల్లో మేత వేసే వారికి కఠిన జరిమానాలు విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పావురాల సంఖ్యను నియంత్రించడానికి మానవీయ, పర్యావరణ రహిత సమతుల్య పద్ధతులను అవలంబించేలా ఆదేశించాలని పిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై తదుపరి విచారణను ఆగస్టు 25వ తేదీకి వాయిదా వేసిందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పావురాల మేతపై చర్చ మె?దలైంది. అవి అంత ప్రమాదకరమా..? అని ప్రజలు చర్చించుకున్నాయి. అయితే అది నిజమేనని అంటున్నారు వైద్య నిపుణులు.

# రెంటికీ చెడ్డా చెవిరెడ్డి

తిరుపతి ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, నమ్మినబంటుగా చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు తీవ్ర అంధకారంలో పడినట్లే కనిపిస్తోంది. పార్టీలో ఆయనకు దక్కిన ప్రాధాన్యత, హోదా మరే నాయకుడికీ లభించలేదనడంలో సందేహం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా ఒంగోలు లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు అప్పగించడమే కాకుండా, ఎంపీ టికెట్ ఇచ్చి మరీ బరిలోకి దించారు. కానీ, మారిన పరిస్థితులు, అంతర్గతంగా బయటపడిన సంచలన నిజాలు జగన్ మోహన్ రెడ్డికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయని, ఫలితంగానే చెవిరెడ్డిని పార్టీ యాజమాన్యం పూర్తిగా పక్కన పెట్టేసిందనే చర్చ వైసీపీ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.జగన్ ఆగ్రహానికి ప్రధాన కారణం లిక్కర్ స్కామ్ వ్యవహారమేనని పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి. పాలనలో మద్యం విధానం రూపకల్పన, డిస్టిలరీల వ్యవహారాల్లో చెవిరెడ్డి కీలక పాత్ర పోషించారని, అయితే ఆ ప్రక్రియలో జగన్ రెడ్డికి, పార్టీకి తెలియకుండా పెద్ద ఎత్తున నిధులు మళ్లించి, తన స్వప్రయోజనాల కోసం డబ్బులు మిగుల్చుకున్నారని సిట్ లెక్కల్లో తేలింది. మద్యం కుంభకోణంలో సొంత మనుషులే తనను మోసం చేశారనే క్లారిటీ జగన్‌కు రావడంతో, చెవిరెడ్డి పట్ల ఉన్న నమ్మకం కాస్తా తీవ్ర అసంతృప్తిగా మారింది. ఆ దెబ్బతోనే ఆయనకు జగన్ దగ్గర ఎంట్రీ బంద్ అయిందనే వార్తలు వినిపిస్తున్నాయి.ఒకప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో నిత్యం దర్శనమిచ్చే చెవిరెడ్డి, ఇప్పుడు కనీసం జగన్ పక్కన నిలబడే అర్హతను కూడా కోల్పోయినట్లయింది. గత కొన్ని నెలలుగా జగన్ మీడియా సమావేశాల్లో కానీ, ముఖ్యమైన పార్టీ సమావేశాల్లో కానీ ఆయనెక్కడా కనిపించకపోవడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డికి తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ దక్కే అవకాశాలు దాదాపు శూన్యమని పొలిటికల్ కారిడార్‌లో టాక్ నడుస్తోంది. పరిస్థితిని బట్టి చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఆయన కుమారుడు మోహిత్ రెడ్డికి ఏమైనా అవకాశం కల్పిస్తారా అంటే.. అప్పటివరకు ఉండే రాజకీయ సమీకరణలు, జగన్ ఆలోచనా విధానాన్ని బట్టి అది కూడా అనుమానాస్పదమేనని తెలుస్తోంది.సజ్జల వర్గం గనుక చెవిరెడ్డిని మరింతగా టార్గెట్ చేస్తే, ఆయన ఇక వైసీపీలో మనుగడ సాగించడం అసాధ్యమనే భావనకు పార్టీ శ్రేణులు వస్తున్నాయి. జగన్ దయ కోల్పోయిన నాయకుడికి వైసీపీలో భవిష్యత్తు లేదనేది బహిరంగ సత్యం. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన నాయకుడే నమ్మకద్రోహం' ముద్ర పడటంతో, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ జీవితానికి గండం తెచ్చి పెట్టింది. సజ్జల వ్యూహాలకు బలిపోతున్న చెవిరెడ్డి, వైసీపీని వీడి వేరే దారి చూసుకుంటారా లేక రాజకీయంగా మౌనం పాటిస్తూ కాలానికి వదిలేస్తారా అనేది వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా, వైఎస్ జగన్ సొంత గూడారంలో చెవిరెడ్డి చాప్టర్ దాదాపు ముగింపునకు వచ్చిందనేది ఎక్కువ మంది నమ్ముతున్న అంశం.

## భారీగా పెరగనున్న ఆస్తి పన్ను...

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలోని భవనాలు, స్థలాల యజమానులకు ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆస్తిపన్ను అసెస్మెంట్ విధానంలో మార్పులు తీసుకువస్తూ పాలకవర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సాంప్రదాయ అద్దె ప్రాతిపదికన కాకుండా.. మార్కెట్ రేట్లకు అనుగుణంగా పన్నులు వసూలు చేసేందుకు వీలుగా కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే.. పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులపై పన్ను భారం ఊహించని రీతిలో పెరగనుంది.హైదరాబాద్ నగరంలోని ఇళ్ళు, వాణిజ్య సముదాయాల యజమానులపై ఆర్థిక భారం పెరగనుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి స్వస్తి పలికి.. దానికి బదులుగా క్యాపిటల్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును నిర్ణయించేందుకు ప్రభుత్వం సమగ్ర అర్బన్ రిఫార్మ్స్ (సీయూఆర్ఈ) ముసాయిదా బిల్లులో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ నూతన సంస్కరణల వల్ల నగర పరిధిలోని నివాసాల యజమానులతో పాటు వాణిజ్య సముదాయాల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.కొత్తగా తీసుకురానున్న 'క్యూర్' ముసాయిదా బిల్లు ప్రకారం.. ఆస్తిపన్ను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే భూమి, భవనాల క్యాపిటల్ విలువనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకోనున్నారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగానికి అనుగుణంగా మార్కెట్లో భూముల ధరలు, భవనాల విలువలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటాయి. దీనివల్ల పన్ను శాతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచకపోయినా, భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను కూడా ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా పెరుగుతూ పోతుంది.ఈ కొత్త ముసాయిదా చట్టంలో ఆస్తుల రకాన్ని బట్టి పన్ను శాతాలను ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇళ్లకు సంబంధించి క్యాపిటల్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు పన్ను స్లాబ్‌లను వర్తింపజేయాలని ప్రతిపాదించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సంబంధించి క్యాపిటల్ విలువలో 0.20 శాతం నుంచి గరిష్ఠంగా 2.00 శాతం వరకు పన్ను స్లాబ్‌లను విధించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదిత విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే నగరంలో ఆస్తులు ఉన్న వారిపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశం ఉంది. పెరుగుతున్న భూముల రేట్లకు అనుగుణంగా ఏటా పన్ను పెరిగే నిబంధన ఉండటంతో.. భవిష్యత్తులో పన్ను భారం మరింత పెరగనుందని స్పష్టం అవుతోంది. అది జరిగితే యజమానులు తమపై పడే పన్ను భారాన్ని అద్దెలు పెంచడం ద్వారా పూడ్చుకోవడానికి ప్రయత్నిస్తారు. దీని వల్ల అంతిమంగా భారం అద్దెదారులపైనే పడే అవకాశం ఉంటుంది.

## ఆయుధ నైపుణ్యంతో ప్రజల భద్రతకు మరింత భరోసా కల్పిద్దాం

వనపర్తి. వార్షిక ఫైరింగ్ లో సిబ్బందితో కలిసి ఆయుధ నైపుణ్యాన్ని పరీక్షించుకున్న బజా జిల్లాలో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్. ఫైరింగ్‌లో ప్రతిభ కనబర్చిన అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయుధాల వినియోగంపై సంపూర్ణ అవగాహన, నైపుణ్యం అత్యంత అవసరమని, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, వృత్తిపరమైన నైపుణ్యాలతో సేవలందించడం ద్వారానే పోలీసుశాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ శ్రీమతి సునీత రెడ్డి, ఐపీఎస్. అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి 10వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో వనపర్తి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని అదనపు ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆయుధాలతో ఫైరింగ్ నిర్వహించి తమ నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు.శిక్షణలో భాగంగా విధుల్లో వినియోగించే ఆయుధాలతో ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి ప్రతి రౌండ్ ఫైరింగ్ చేసే అవకాశం కల్పించారు. ఫైరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో కూడా ఇదే నైపుణ్యాన్ని కొనసాగించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ వద్ద ఉన్న ఆయుధాల పనితీరు, వినియోగ విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆయుధాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ సక్రమ స్థితిలో ఉంచాలని

# రాజ్యాంగ రక్షకులా..వివాదాల సృష్టికర్తలా?

హైదరాబాద్,శాసనం, న్యాయం, పాలన... ఈ మూడింటికీ ప్రజాస్వామ్యంలో అత్యున్నత పీఠాలు ఉన్నాయి. వాటిని నడిపించే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దేశానికి వెన్నెముక వంటివారు. కానీ, ఇటీవలి పరిణామాలు, వరుస వివాదాలు, అవినీతి కుంభకోణాలు ఈ వ్యవస్థల ప్రతిష్ఠపై మచ్చ తెస్తున్నాయి. తాజాగా హైదరాబాద్లో ఐపీఎస్ ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం సహా అనేక ఘటనలు దేశవ్యాప్తంగా అధికారుల నైతిక దిగజారుడుపై తీవ్ర చర్చకు దారితీశాయి. యూపీఎస్సీ వంటి అత్యున్నత పరీక్షల్లో ఉత్తీర్ణులై, కోట్ల మందికి ఆదర్శంగా నిలవాల్సిన కొందరు అధికారులు దారితప్పుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రజాసేవ, నిజాయితీ, నిష్పాక్షికతలను పక్కనబెట్టి అవినీతి, అక్రమ సంపాదన, వివాహేతర సంబంధాలు, కుటుంబ వివాదాలు, బ్లాక్మెయిలింగ్లు మరియు అక్రమ మైనింగ్ వంటి క్రిమినల్ వ్యవహారాల్లో చిక్కుకుంటున్నారు. దేశాన్ని కుదిపేసిన ప్రముఖ ఐఏఎస్, ఐపీఎస్ వివాదాలను గమనిస్తే..గత రెండు దశాబ్దాలుగా కేంద్ర దర్యాప్తు సంస్థలువిచారించిన కొన్ని కీలక కేసులు ఈ విలువల సంక్షోభాన్ని స్పష్టంగా చూపుతున్నాయి. దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీబీఐలో నాటి డైరెక్టర్ అలోక్ వర్మ , స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానా పరస్పరం కోట్లాది రూపాయల లంచం ఆరోపణలు చేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ వివాదంతో ప్రభుత్వం ఇద్దరినీ బాధ్యతల నుంచి తప్పించాల్సి వచ్చింది. పూజా సింఘల్ (ఐఏఎస్ – జార్ఖండ్): మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేయగా, దర్యాప్తులో భారీగా నగదు స్వాధీనం చేసుకుంది.బి. చంద్రకళ (ఐఏఎస్ – ఉత్తరప్రదేశ్): అక్రమ ఇసుక తవ్వకాల కేసులో సీబీఐ విచారణను ఎదుర్కొన్నారు.అర్వింద్ జోషి ఒ టినూ జోషి (ఐఏఎస్ దంపతులు – మధ్యప్రదేశ్): 2010లో దాడుల సందర్భంగా వీరి నివాసాల నుంచి కోట్లాది రూపాయల నగదు, బంగారం లభ్యమయ్యాయి.రాజేంద్ర కుమార్ (ఐఏఎస్ – ఢిల్లీ) ఒ ప్రదీప్ శర్మ (ఐఏఎస్ – గుజరాత్): కాంట్రాక్టులు, భూ కేటాయింపుల్లో అవకతవకలు మరియు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దర్యాప్తు ఎదుర్కొన్నారు.బి.కె. బన్సాల్ పై తీవ్ర అవినీతి ఆరోపణల దర్యాప్తు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు విషాదాంతంగా ముగిశాయి. ఇక ఐపీఎస్ అధికారులు – క్రిమినల్ / దర్యాప్తు వివాదాల విషయానికొస్తే.. డి. జి. వంజారా (ఐపిఎస్ – గుజరాత్): పలు ఎన్కౌంటర్ కేసుల్లో సీబీఐ విచారణ ఎదుర్కొని సుదీర్ఘకాలం జైలులో ఉన్నారు. సంజీవ్ భట్ (ఐపిఎస్ – గుజరాత్): క్రిమినల్ కేసుల్లో అరెస్టయి ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నారు. పరమ్ బీర్ సింగ్ (ఐపిఎస్ – మహారాష్ట్ర): ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అయిన ఈయనపై వసూళ్లు, అవినీతి ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. రాజీవ్ కుమార్ (ఐపిఎస్ – పశ్చిమ బెంగాల్): శారదా చిట్ఫండ్ దర్యాప్తు వివాదంలో సీబీఐ విచారణ ఎదుర్కొన్నారు. గుర్జోత్ సింగ్ కలేకా (ఐపిఎస్ – పంజాబ్): సైబర్ క్రైమ్, డ్రగ్స్ వ్యవహారంలో కోట్లలో లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై విజిలెన్స్ విచారణను ఎదుర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ అలజడి తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు అధికారులు కూడా తీవ్ర ఆరోపణలు, సస్పెన్షన్లు ఎదుర్కొన్నారు: యర్రా శ్రీలక్ష్మి –ఐఏఎస్ ఏకంగా జైలుకు వెళ్లాల్సి రావడంతో




కెరీర్ పరంగా ఉన్నత పదవులకు దూరమై అనామకంగా పదవీ విరమణ చేశారు.'సస్పెన్షన్లలో ఉన్న అధికారులు: విశాల్ గున్ని, క్రాంతిరాణా టాటా తదితరులు సస్పెన్షన్లు ఎదుర్కొనగా, సునీల్ సస్పెన్షన్లోనే రిటైర్ అయినా కేసులు ఇంకా వెంటాడుతున్నాయి.జి. సంపత్ కుమార్ –ఐపిఎస్ : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ విచారణను ఎదుర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో పార్లమెంట్కు సమర్పించిన వివరాల ప్రకారం–2009–2012 మధ్య ఐఏఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ అధికారులపై 90 అవినీతి కేసులు నమోదయ్యాయి. 2015–2017 మధ్య 17 మంది ఐఏఎస్, ముగ్గురు ఐపిఎస్ అధికారులపై అభియోగాలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. 2014–2019 మధ్య నలుగురు ఐపిఎస్ అధికారులపై అవినీతి నిరోధక చట్టం కింద ప్రాసిక్యూషన్కు అనుమతి లభించింది. 2018 నాటికి 29 మంది ఐపిఎస్ అధికారులు శాఖాపరమైన విచారణలు లేదా క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ఇటీవల కూడా వివిధ రాష్ట్రాల్లో ఉన్నతాధికారులపై శాఖాపరమైన విచారణలు కొనసాగుతున్నట్లు పార్లమెంట్కు సమాచారం అందింది.ఇలాంటి ఘటనలు కొన్ని కాలక్రమేణా మారవచ్చు కానీ ప్రజలను కలవరపెడుతున్నాయి. ఇవి కొందరు వ్యక్తుల వైఫల్యమే తప్ప మొత్తం ఐఏఎస్, ఐపీఎస్ వ్యవస్థ ప్రతిబింబం కాదు.దేశవ్యాప్తంగా వేలాది మంది అధికారులు అత్యంత నిజాయితీ, నిబద్ధతలతో ప్రజలకు సేవలందిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, డిజిటల్ పాలన, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో విశేష కృషి చేసి రాష్ట్రపతి పురస్కారాలు, ప్రధాని అవార్డులు అందుకుంటున్న ఆదర్శ అధికారులు నేటికీ ఈ వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెడుతున్నారు.ఐఏఎస్, ఐపీఎస్ వ్యవస్థలపై ప్రజల్లో గౌరవం, విశ్వసనీయత నిలవాలంటే తక్షణమే కొన్ని కఠిన సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. త్వరితగతిన విచారణ చేపట్టి ఉన్నతాధికారులపై వచ్చే ఆరోపణలను వేగంగా తేల్చేందుకు ప్రత్యేక కోర్టులను బలోపేతం చేయాలి. విచారణలో తప్పు రుజువైతే దాటవేత ధోరణి లేకుండా వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలి అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. పారదర్శకత, జవాబుదారీతనం పెరిగినప్పుడే అత్యున్నత సివిల్ సర్వీసుల గౌరవం నిలబడుతుంది!

# ఎన్డీఏ పాలనలో విద్యాశాఖ వివాదాలు




న్యూఢిల్లీ,భారతదేశ విద్యా వ్యవస్థను అత్యున్నత శిఖరాలకు తీసుకువెళ్లాల్సిన కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా తీవ్ర వివాదాలు, కుదుపులకు లోనైంది. ఎన్డీఏ ప్రభుత్వ పన్నెండేళ్ల పాలనా కాలంలో నలుగురు వేర్వేరు మంత్రులు ఈ కీలక బాధ్యతలను నిర్వర్తించినప్పటికీ, వారిలో ముగ్గురు కనీసం మూడేళ్లు కూడా పదవిలో కొనసాగలేకపోయారు. కేవలం ధర్మేంద్ర ప్రధాన్ మాత్రమే ఐదేళ్ల పూర్తి కాలం పని చేసినప్పటికీ, చివరికి 'నీట్' పరీక్షల లీకేజీలు, చెలరేగిన దేశవ్యాప్త నిరసనల సెగతో ఆయన కూడా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. 2014 నుంచి ఇప్పటివరకు విద్యాశాఖను చుట్టుముట్టిన సంచలన వివాదాలివే..

### మారిన పేర్లు.. రద్దయిన ఎఫ్‌వైయూపీ

2014 మే 26 నుంచి 2016 జూలై 5 వరకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఇప్పుడు విద్యా మంత్రిత్వ శాఖ) బాధ్యతలు చేపట్టిన స్మృతి ఇరానీ హయాంలో పలు సంచలన నిర్ణయాలు వెలువడ్డాయి. ఆమె పదవీకాలంలో తీసుకున్న అతిపెద్ద నిర్ణయాలలో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అమలవుతున్న నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌వైయూపీ) రద్దు చేయడం ఒకటి. దీనివల్ల విద్యార్థి, ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అయితే ఇదే సమయంలో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ముసాయిదా రూపకల్పనకు శ్రీకారం చుట్టడంతో పాటు, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ రేంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)ను ఆమె ప్రారంభించారు.

### జేఎన్‌యూ వివాదాలు, రోహిత్ వేముల ఆత్మహత్య

స్మృతి ఇరానీ పదవీకాలం అనేక రాజకీయ తుఫాన్లకు కేంద్రబిందువుగా మారింది. జేఎన్‌యూలో చెలరేగిన భారీ నిరసనలు, నాటి విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్హయ్య కుమార్ అరెస్టు దేశవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించాయి. ఈ పరిణామాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. అలాగే 2016 జనవరిలో చోటుచేసుకున్న రోహిత్ వేముల ఆత్మహత్య ఉదంతం ప్రభుత్వంపై తీవ్ర నైతిక ఒత్తిడి తెచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో 2016 జూలైలో ఆమెను విద్యాశాఖ నుంచి తప్పించి జౌళి శాఖకు బదిలీ చేశారు.

### ఐఐఎంలకు స్వయంప్రతిపత్తి.. ఎన్‌టీఏ ఏర్పాటు

స్మృతి ఇరానీ తర్వాత విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన ప్రకాశ్ జవదేకర్ 2016 జూలై 5 నుంచి 2019 మే 30 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలో ప్రవేశపెట్టిన 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)యాక్ట్–2017' ద్వారా ఐఐఎం సంస్థలకు మరింత స్వయంప్రతిపత్తి లభించింది. అలాగే దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల నిర్వహణను ఒకే గొడుగు కిందకు తెచ్చే ఉద్దేశంతో 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ)ను ఆయన ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాతి కాలంలో నీట్ పేపర్ లీక్ అంశంలో ఇదే ఎన్‌టీఏ తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

### నో డిటెన్షన్ పాలసీ రద్దు.. సీబీఎస్ఈ పేపర్ లీక్

జవదేకర్ హయాంలో విద్యా హక్కు చట్టానికి సవరణ చేసి, ఐదు, ఎనిమిది తరగతుల్లో పిల్లలను ఫెయిల్ చేయకుండా పై తరగతులకు పంపే 'నో డిటెన్షన్ పాలసీ'ని రద్దు చేశారు. అయితే 2018లో సీబీఎస్ఈ బోర్డు పరీక్షల పేపర్ లీక్ కావడంతో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ తీవ్ర విమర్శలపాలైంది. అంతేకాకుండా, జియో ఇన్‌స్టిట్యూట్‌కు 'ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఎమినెన్స్' హోదా కట్టబెట్టడం కూడా పెద్ద వివాదానికి దారితీసింది.

### నిశాంక్ హయాంలో జాప్యమైన కీలక నియామకాలు

2019లో ప్రకాష్ జవదేకర్ స్థానంలో డాక్టర్ రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన హయాంలో 2020 జూలైలో నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ఆమోదం పొందడం ఒక మైలురాయిగా నిలిచినా, దాని రూపకల్పనలో సింహభాగం అంతకుముందే పూర్తయింది. అయితే ఆయన కాలంలో జెఎన్‌యూ, బీహెచ్‌యూ, ఢిల్లీ వర్సిటీ వంటి ప్రముఖ కేంద్ర విశ్వవిద్యాలయాలకు నెలల తరబడి వైస్‌చాన్సలర్ల నియామకాలు జరగలేదు. అలాగే ఐదు ఐఐటీ సంస్థలకు పూర్తిస్థాయి డైరెక్టర్లను నియమించడంలో తీవ్ర జాప్యం జరిగింది. అనారోగ్య కారణాలరీత్యా ఆయన 2021 జూలైలో పదవికి రాజీనామా చేశారు.

### ధర్మేంద్ర ప్రధాన్ రాక.. జాతీయ స్థాయిలో సంక్షోభాలు

రమేష్ పోఖ్రియాల్ నిష్క్రమణ తర్వాత విద్యాశాఖ పగ్గాలు చేపట్టిన ధర్మేంద్ర ప్రధాన్ సుదీర్ఘకాలం పదవిలో కొనసాగినప్పటికీ, ఆయన కూడా వివాదాల నుంచి తప్పించుకోలేకపోయారు. ఎన్‌సీఈఆర్టీ సిలబస్ మార్పులు, పాఠ్యాంశాల తొలగింపు వంటి అంశాలపై మేధావులు, విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలు రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నాయంటూ బీజేపీ పాలనలో లేని రాష్ట్రాల నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.

### 'నీట్' తుఫాన్.. పదవిని కోల్పోయిన మంత్రి

ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో 'నీట్–యూజీ' ప్రవేశ పరీక్షలో తలెత్తిన పేపర్ లీక్ కుంభకోణం, గ్రేస్ మార్కుల వివాదం దేశవ్యాప్తంగా విద్యార్థులను రోడ్డెక్కేలా చేశాయి. సుప్రీంకోర్టు జోక్యం, సీబీఐ దర్యాప్తు వరకు వెళ్లిన ఈ వ్యవహారం ఎన్‌టీఏ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేసింది. పరీక్షల మాఫియా అంతుచూస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, దేశవ్యాప్తంగా చెలరేగిన తీవ్ర నిరసనలు, ఆందోళనల కారణంగా ధర్మేంద్ర ప్రధాన్ చివరకు తన విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

## పంట కాలువలో ముగ్గురు దుర్మరణం

రామచంద్రపురం మండలం వెంకటపాలెం గ్రామ సమీపంలోని పంట కాలువలో స్నానానికి దిగిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటనలో కనికెళ్ళ రంజిత్ కుమార్(15), బొక్క వీరేంద్ర(18), వేమన పావని(15) మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతులు కపిలేశ్వరపురం మండలం అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి గ్రామాలకు చెందినవారు. వీరు అక్కాచెల్లెళ్ల పిల్లలు కాగా ప్రస్తుతం హైదరాబాద్ లో నివసిస్తున్నారు. రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామంలోని అమ్మ ఇంటికి నిన్న జరిగిన తాతయ్య సంస్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చారు. ఈరోజు సమీపంలోని వెంకటపాలెం పంట కాలువలో స్నానానికి వెళ్లి ఈ ప్రమాదానికి గురయ్యారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మంత్రి సుభాష్ తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

# పట్టు కోసం కమలం బిగ్ ప్లాన్

హైదరాబాద్, తెలంగాణ రాజకీయ వేదికపై అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అధిష్టానం అత్యంత వేగంగా పావులు కదుపుతోంది. సాంప్రదాయ రాజకీయ శైలికి భిన్నంగా, పూర్తిగా డేటా ఆధారిత కార్పొరేట్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా ఆపరేషన్ సాఫ్రాన్ పేరుతో ప్రొఫెషనల్ ఎలక్షన్ ఏజెన్సీలను క్షేత్రస్థాయిలోకి దించనుంది. రాబోయే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే ముమ్మరంగా గ్రౌండ్ వర్క్ ప్రారంభించింది.గత అనుభవాలు, ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన బీజేపీ హైకమాండ్, ఈసారి ముగ్గురు కీలక నేతల మార్గదర్శకంలో మూడు ప్రత్యేక ప్రొఫెషనల్ ఏజెన్సీలను రంగంలోకి దించింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఇందులో మొదటిది అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్. హోంమంత్రి అమిత్ షా నేరుగా పర్యవేక్షించే ఈ సంస్థ, గత కొన్ని నెలలుగా తెలంగాణలో పార్టీ పొలిటికల్ ఎజెండా, ప్రచార వ్యూహాలను నిశితంగా రూపొందిస్తోంది. ఇక రెండోది జార్విస్. సాంకేతికత, కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఈ ఏజెన్సీ దృష్టి సారించింది. భారీ కాల్ సెంటర్ల నిర్వహణ ద్వారా నియోజకవర్గాల్లోని ఓటర్లను నేరుగా సంప్రదించడం, ప్రజల అభిప్రాయాలను సమీకరించడం, బూత్ కమిటీల పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను చూస్తోంది. అంతేకాకుండా పార్టీ కార్యకర్తలు, నాయకుల నిర్వహణ కోసం రూపొందించిన 'సరళ్ యాప్' బాధ్యతలను కూడా జార్విస్ సమర్థవంతంగా నిర్వహిస్తోంది. ఇక మూడోది అభీష్ట టీమ్. పశ్చిమ బెంగాల్, బిహార్ ఎన్నికలలో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించి, మెరుగైన ఫలితాలను అందించిన 'అభీష్ట' ప్రొఫెషనల్ ఏజెన్సీని తాజాగా తెలంగాణకు రప్పించారు. ఈ టీమ్ బి.ఎల్.సంతోష్ పర్యవేక్షణలో బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు లోతైన అధ్యయనం చేస్తోంది.క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు 'అభీష్ట' బృందం ప్రస్తుతం 'సర్' అంటే స్టడీ, అండర్ స్టాండ్, రిపోర్ట్ ప్రక్రియను చేపట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణం ఏ విధంగా ఉంది? బూత్ లెవెల్ ఏజెంట్లు సరిగ్గా పనిచేస్తున్నారా? అనే అంశాలపై నివేదికలను ఎప్పటికప్పుడు ఢిల్లీ అధిష్టానానికి అందిస్తోంది.ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపును ప్రభావితం చేయగల 50 నుంచి 100 మంది ప్రముఖ వ్యక్తుల జాబితాను ఈ టీమ్ సిద్ధం చేస్తోంది. ఇందులో రాజకీయ నేతలతో పాటు సమాజంలో మంచి పేరున్న వ్యాపారవేత్తలు, మేధావులు, సామాజిక వేత్తలు, ప్రజాదరణ ఉన్న వ్యక్తులను గుర్తిస్తున్నారు. వీరిని పార్టీ వైపు ఆకర్షించడం లేదా పార్టీ విజయంలో వీరి మద్దతును వినియోగించుకోవడంపై ప్రణాళికలు రచిస్తున్నారు.కేవలం కేంద్ర నాయకత్వపు నివేదికలపైనే ఆధారపడకుండా, ఈ ఏజెన్సీలకు లోకల్‌గా అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి బీజేపీ, దాని అనుబంధ సంఘాల నుంచి శిక్షణ పొందిన వాలంటీర్లను నియమించారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పక్కాగా అసెస్ చేసి, దానిని ఓట్లుగా మార్చుకునేందుకు స్పష్టమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇతర పార్టీలలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నాయకులను చేర్చుకోవడంలోనూ ఈ ఏజెన్సీల గ్రౌండ్ రిపోర్టులు మార్గదర్శకంగా నిలవనున్నాయి.మొదటగా జీహెచ్ఎంసీ పరిధిలోని ఓటర్ల నాడిని పట్టుకుని, అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార సరళి వరకు బ్యాక్ ఎండ్ నుంచి నడిపించేందుకు సిద్ధమయ్యారు. కేవలం స్థానిక నాయకత్వ బలంపైనే ఆధారపడకుండా, ఇటువంటి ఆధునిక డేటా విశ్లేషణ, కార్పొరేట్ తరహా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ పద్ధతులు రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఎంతవరకు ప్రయోజనం చేకూరుస్తాయో వేచి చూడాలి.

## పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

విశాఖపట్టణం, సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ అని పిలుస్తారు. లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరిం చడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగిం ది.చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం, పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## పచ్చదనంతోనే మెరుగైన ఆరోగ్యం...

తుగ్గలి: అడవులలో గల పచ్చదనంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నూర్జహాన్ బి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలో గల రిజర్వ్ ఫారెస్ట్ నందు సీడ్ బాల్స్ ను డ్రోన్ ద్వారా వెదజల్లే కార్యక్రమాన్ని మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు ప్రారంభించారు.పర్యావరణ పరిరక్షణ మరియు అడవులను అభివృద్ధిపరిచే కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ విస్తరణ కొరకు 35 వేల సీడ్ బాల్స్ ను తయారు చేసినట్లు ఆమె తెలియజేశారు.డ్రోన్ ద్వారా దాదాపుగా 3 వేల సీడ్ బాల్స్ ను వెదజల్లినట్లు డిప్యూటీ ఆర్.ఓ నూర్జహాన్ బి తెలియజేశారు.అటవీ శాఖ విస్తరణ కొరకు, అటవీ శాఖ అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి తెలియజేశారు.పచ్చదనంతోనే సరైన వర్షాలు కురిసి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ లక్ష్మన్న,భాస్కర్,అల్లా బకాష్, గ్రామ ప్రజలు,యువత తదితరులు పాల్గొన్నారు.


# ప్రత్యక్ష ఎన్నికల దిశగా అడుగులు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓ భారీ మలుపు తిరగబోతోంది. స్థానిక సంస్థల్లో ఏళ్ల తరబడి శాపంగా మారిన క్యాంప్ రాజకీయాలు , బేరసారాలు, బెదిరింపులకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య సంస్కరణకు రూపకల్పన చేస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ ( చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పరోక్ష ఎన్నికల పేరిట స్థానిక సంస్థల్లో సాగుతున్న ప్రజాస్వామ్య హననాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు భావిస్తున్నారు.పరోక్ష ఎన్నికల విధానంలో గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న తర్వాత, వారు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో అధికార బలం, ఆర్థిక ప్రాబల్యం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం పీక్ స్టేజ్‌కు చేరుకుంటాయి. మెజార్టీ రాని అధికార పార్టీలు కూడా ప్రతిపక్షాల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను రిసార్టులకు తరలించడం, క్యాంపులు నిర్వహించడం, రకరకాల ఒత్తిళ్లకు గురిచేసి తమవైపు తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. చివరికి ప్రజల తీర్పు ఒకటైతే, పీఠంపై కూర్చునేది మరొకరయ్యే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజల చేతికే నేరుగా ఓటు హక్కు ఇవ్వడమే ఏకైక మార్గమని భావిస్తున్నారు.సాధారణంగా ఏ అధికార పార్టీ కూడా ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సాహసించదు. ఎందుకంటే, పరోక్ష విధానం ఉంటే వార్డుల్లో సీట్లు తగ్గినా, సర్పంచ్ లేదా కౌన్సిలర్లను లొంగదీసుకుని మున్సిపాలిటీలు, జడ్పీలను కైవసం చేసుకునే వెసులుబాటు అధికారంలో ఉన్న పార్టీకి ఉంటుంది. అయితే, అక్రమ మార్గాల్లో పీఠాలను దక్కించుకునే సంస్కృతి కంటే, పారదర్శకమైన ప్రజా తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో జరిగే కోట్లాది రూపాయల బేరసారాలకు స్వస్తి పలికితే, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందనేది నమ్మకం.గత చరిత్రను పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు నేరుగా ప్రజలే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2000వ దశకం ప్రారంభంలో చంద్రబాబు



హయాంలోనూ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను నేరుగా ఎన్నుకునే పద్ధతి నడిచింది. అయితే, కౌన్సిల్‌లో ఒక పార్టీకి మెజార్టీ ఉండి, మేయర్, చైర్మన్ మరొక పార్టీకి చెందినవారు గెలిస్తే పాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతోందనే నెపంతో తర్వాతి ప్రభుత్వాలు మళ్లీ పరోక్ష విధానానికే మొగ్గు చూపాయి.చట్టపరమైన కోణంలో చూస్తే.. భారత రాజ్యాంగంలోని 243అ పంచాయతీలు, 243ఖీ మున్సిపాలిటీలు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల అధ్యక్షుల ఎన్నికల విధానాన్ని నిర్ణయించే సర్వాధికారాలు రాష్ట్ర శాసనసభలకే ఉన్నాయి. దీనికోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 , అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 , మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లకు అసెంబ్లీలో సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కూటమికి అసెంబ్లీలో అత్యధిక మెజార్టీ ఉన్నందున, ఈ చట్టసవరణ చేయడం ప్రభుత్వానికి సునాయాసమైన ప్రక్రియే కానుంది. ఈ ప్రత్యక్ష విధానం అమల్లోకి వస్తే రాజకీయ పార్టీలపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం డబ్బు సంచులతో కౌన్సిలర్లను కొనుగోలు చేసే ధనస్వామ్య నాయకులకు కాలం చెల్లి, ప్రజల్లో మంచి గుర్తింపు, ఆమోదయోగ్యత ఉన్న నాయకులకే పార్టీలు బీ-ఫారాలు ఇవ్వాల్సి వస్తుంది. ఒక వేళ కౌన్సిల్‌లో ప్రతిపక్షాల బలం ఎక్కువగా ఉన్నా, ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన మేయర్, చైర్మన్ బడ్జెట్ ఆమోదం, పాలనా నిర్ణయాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అధికారంలో ఉండి కూడా పరోక్ష లబ్ధిని వదులుకుని ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లడం అనేది ఒక రాజకీయ తెగువగా అభివర్ణించవచ్చు. ఈ ప్రతిపాదన గనుక చట్టరూపం దాల్చి అమల్లోకి వస్తే, భవిష్యత్తులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆంధ్రప్రదేశ్ స్థానిక పాలనలో మార్గదర్శిగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# అమర్ రాజా చుట్టూ రాజకీయం




గుంటూరు ,తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి గిగా కారిడార్‌లో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థకు చెందిన అడ్వాన్స్‌డ్ కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ విజయవంతంగా ప్రారంభమవ్వడం పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. నాలుగు దశాబ్దాలుగా చిత్తూరు నేలను కేంద్రంగా చేసుకుని ఎదిగిన ఒక స్వదేశీ దిగ్గజ సంస్థ, ఏకంగా 9,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించే లిథియం-అయాన్ గిగాఫ్యాక్టరీ ప్రాజెక్టును పొరుగు రాష్ట్రానికి తరలించాల్సి రావడంపై ఏపీలో రాజకీయం ప్రారంభమయింది. ఈ పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగానికి జరిగిన తీరని లోటుగా అభివర్ణిస్తూ, తెలుగుదేశం పార్టీ గతాన్ని తవ్వి తీస్తూ వైఎస్సార్‌సీపీపై తీవ్రంగా విమర్శలు చేస్తోంది. ఈ ప్రారంభోత్సవం వెనువెంటనే ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన ప్రకటన ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థపై సాగిన రాజకీయ కక్షసాధింపు చర్యలు, వేధింపుల కారణంగానే రాష్ట్రం ఒక చారిత్రక పారిశ్రామిక అవకాశాన్ని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరరాజా ఛైర్మన్ గల్లా జయదేవ్ కుటుంబానికి ఏపీ సమాజం క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం తెచ్చిపెట్టిందని, నాటి జగన్ రెడ్డి సర్కార్ అవలంబించిన విధ్వంసకర విధానాలే ఈ ప్రాజెక్ట్ తెలంగాణ పాలమూరు రంగానికి వెళ్లడానికి కారణమని లోకేష్ తో పాటు టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో విమర్శలు ప్రారంభించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా గ్రూప్‌ను రాజకీయ లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గల్లా జయదేవ్ టీడీపీ ఎంపీగా ఉండటంతో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా ప్లాంట్ల మూసివేత నోటీసులు ఇవ్వడం, విద్యుత్ , నీటి సరఫరాను అడ్డుకోవడం, కేటాయించిన 253 ఎకరాల పారిశ్రామిక భూములను రద్దు చేసేందుకు ప్రయత్నించడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ తీవ్ర ఒత్తిళ్లు, అనిశ్చితి వాతావరణాన్ని తట్టుకోలేకనే అమరరాజా తన భవిష్యత్ విస్తరణ అయిన లిథియం-అయాన్ ఈవీ బ్యాటరీ క్లస్టర్‌ను తెలంగాణకు తరలించాల్సి వచ్చిందని పారిశ్రామిక నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు.ఈ మొత్తం వ్యవహారంలో ఒకరి నష్టం మరొకరికి లాభంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ యువతకు రావాల్సిన వేలాది ఉద్యోగాలు, రాష్ట్రానికి దక్కాల్సిన కోట్ల రూపాయల పన్ను ఆదాయం నేడు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు దక్కాయి. తెలంగాణ ప్రభుత్వం సమకూర్చిన అనుకూల వాతావరణంతో దివిటిపల్లి వద్ద అమరరాజా తన ఆసియాలోనే అతిపెద్ద గిగాఫ్యాక్టరీల్లో ఒకదానిని సాకారం చేసుకుంటోంది. చిత్తూరు ప్రాంతంలో ఉపాధి ఆశలు అడుగంటిపోగా, పొరుగు రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారడంపై రాయలసీమ ప్రజల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రస్తుతం ఏపీలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని ఒక పదునైన కేస్ స్టడీగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పక్కా వ్యూహం సిద్ధం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవలంబించిన కక్షసాధింపు పారిశ్రామిక విధానాలు ఎవరికీ శ్రేయస్కరం కావని, దాంతో రాష్ట్ర ప్రతిష్ట ఏ విధంగా దెబ్బతిన్నదో వివరించడానికి జిల్లాల వారీగా ప్రచారానికి సిద్ధమవుతోంది. గతం గడిచిపోయినా.. అమరరాజా గ్రూప్ ఏపీలో చేపట్టబోయే ఏ ఇతర నూతన విస్తరణ ప్రాజెక్టులకైనా తమ ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తుందని, పూర్తి సహకారాన్ని అందిస్తుందని నారా లోకేష్ పునరుద్ఘాటించారు. కేవలం ఒక్క అమరరాజాయే కాకుండా, గతంలో రాష్ట్రం నుంచి బయటకు వెళ్లిపోయిన సుజలాన్, ఫాక్స్‌కాన్ అసెంబ్లీ యూనిట్లు, ఇతర చిన్న-తరహా పరిశ్రమల నిర్వాహకులకు మళ్లీ భరోసా కల్పిస్తూ ఏపీలో పారిశ్రామిక పునరుజ్జీవనానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇది 'జగన్ మార్క్ పాలనా వైఫల్యం'పై పోరాటానికి టీడీపీకి దొరికిన బలమైన ఆయుధంగా మారింది. రాబోయే రోజుల్లో ఈ పారిశ్రామిక రాజకీయం ఏపీలో మరింత వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

# మోడీ రాహుల్ కి ఒకే ఒక్క మాటతో ఒవైసీ షాక్ !



హైదరాబాద్,మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ దేశం ముందు అతి పెద్ద చర్చకు పాయింట్ ని పెట్టారు. అదేంటి అంటే ఈ దేశానికి యువ ప్రధాని కావాలని. దానికి ఆయన లాజిక్ తో సహా అన్నీ వివరించారు. దానిని వింటే ఎవరైనా ఒప్పుకోవాల్సిందే. అయితే ఒవైసీ ఏ ఉద్దేశ్యంతో ఎవరిని టార్గెట్ చేసి అన్నారో తెలియదు కానీ ఆయన కామెంట్స్ తో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి కూడా షాక్ ఇచ్చేశారు. ఇంతకీ ఒవైసీ ఏమన్నారు అంటే మ్యాటర్ వెరీ ఇంట్రెస్టింగ్ మరి.

యూత్ ప్రైమ్ మినిస్టర్ అంటూ :

తాజాగా యూపీ సభలో అసదుద్దీన్ మాట్లాడుతూ ఈ దేశం యువ ప్రధానిని కోరుకుంటోంది అన్నారు. ఈ దేశంలో నూటికి అరవై శాతం మంది 35 లోపు యువత ఉన్నారని అందులో 50 శాతం పైగా 25 ఏళ్ళ యువత ఉన్నారని కూడా లెక్క చేప్పారు. మరి ఇంత పెద్ద యువ జనాభా ఉన్న దేశంలో యువ ప్రధాని కాకుండా వృద్ధులు అవడం సమంజసమా అని ఆయన లాజిక్ తోనే మాట్లాడారు. అంతే కాదు 2029 ఎన్నికల తరువాత 80 ఏళ్ళ వృద్ధుడు ప్రధాని కాకుండా యువ ప్రధాని కావాలన్నదే తమ ప్రయత్నం అన్నారు. యూత్ ప్రధాని అంటే 40 నుంచి 45 లోపు ఉండాలని కూడా ఒవైసీ ఒక కండిషన్ పెట్టారు. దాంతో మోడీకే కాదు రాహుల్ కి కూడా షాక్ తగిలినట్లు అయింది.

బీజేపీ ఘాటుగానే :

ముస్లిం బుజ్జగింపు రాజకీయాలలో భాగంగానే ఒవైసీ ఈ విధంగా మాట్లాడుతున్నారని బీజేపీ మండిపడింది. వయసుతో పదవులకు సంబంధం ఏంటి బీజేపీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా దేవ్ ప్రశ్నించారు. అమెరికాను ఏలే అధ్యక్షుడు ట్రంప్ వయసు 80 ఏళ్ళు అన్నది మరచారా అని ఒవైసీని నిలదీశారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధిని సాధిస్తూ ముందుకు పోతోంది అని ప్రతుల్ షా దేవ్ గుర్తు చేశారు. ఈ దేశంలో ప్రధానిని వయసుతో సంబంధం లేకుండా ప్రజలు ఎన్నుకుంటారు అని ఆయన అన్నారు.

కాంగ్రెస్ సైతం :

ఇదే విషయం మీద కాంగ్రెస్ కూడా గట్టిగానే రియాక్ట్ అయింది. ఎందుకంటే 2029 నాటికి రాహుల్ గాంధీకి 59 ఏళ్ళ వయసు వస్తుంది. దాంతో ఆ పార్టీ కూడా ఒవైసీ కామెంట్స్ మీద బాగా హర్ట్ అయినట్లుంది. దాంతో కాంగ్రెస్ నేత రాకేష్ సిన్హా దీని మీద మాట్లాడుతూ భారత దేశం గొప్ప ప్రజాస్వామిక దేశం అన్నారు. ఈ దేశంలో వృద్ధులు ఎనభై ఏళ్ళ వారు అయినా పోటీ చేసి చేయవచ్చు అని అలాగే యువకులు కూడా పోటీ చేసి గెలవవచ్చు అన్నారు. అదే సమయంలో గెలిచిన పార్టీ తన నాయకుడుని ఎన్నుకుంటుందని అలా చూస్తే ప్రజలే తమ నాయకుడు ఎవరో కొత్త ప్రధాని ఎవరో ఎన్నుకుంటారు అని రాకేష్ సిన్హా వివరించారు. అదే విధంగా కాంగ్రెస్ కి చెందిన మరో ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ కూడా ఒవైసీ కామెంట్స్ మీద రియాక్ట్ అయ్యారు. రాహుల్ గాంధీ గొప్ప విజన్ ఉన్న నాయకుడు అన్నారు. ఆయన ఈ రోజున దేశ నిర్మాణంలో అతి ముఖ్య పాత్ర పోషిస్తున్నారు అని అన్నారు.

యూత్ కే టికెట్లు :

అయితే ఒవైసీ మాత్రం ఇది యువ భారతం అని గట్టిగా నొక్కి చెబుతున్నారు. తమ పార్టీ తరపున ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో యువతకే టికెట్లు ఇస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద చూస్తే యువ ప్రధాని అంటూ ఒవైసీ మాటల మంటలను పుట్టించారు. నిజంగా ఈ దేశంలో యువ నేత పాలకుడు కావాలని జనాలు కోరుకుంటున్నారా అన్నదే బిగ్ డిబేట్. అలా కోరుకుంటే కచ్చితంగా యువకులే పగ్గాలు అందుకుంటారు. ఒకప్పుడు ప్రజలు రాజీవ్ గాంధీని ఎన్నుకున్నారు. ఆయన 40 ఏళ్ళకే దేశ ప్రధాని అయిపోయారు. మళ్ళీ ఆ తరువాత భారత దేశం యువ ప్రధానిని చూడలేదు. ఒవైసీ ఏ ఉద్దేశ్యంతో ఈ కామెంట్స్ చేసినా దేశ జనాభాలో అధికంగా యువత ఉన్నారు. మరి వారే ఈ దేశాన్ని నడిపించాలని అనుకుంటే వారు వృద్ధులు వద్దు అనుకుంటే యువ పాలన తప్పనిసరిగా వస్తుంది.


# నీట్ ను పట్టించుకోని తెలుగు ప్రాంతీయ పార్టీలు

హైదరాబాద్, దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, కేంద్ర ప్రభుత్వ విద్యారంగ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు మిన్నంటుతున్నా, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్ , వైఎస్సార్‌సీపీ అనూహ్యంగా మౌనం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ , వివిధ విద్యార్థి సంఘాలు రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు మాత్రం క్రియాశీలక పోరాటాలకు దూరంగా ఉంటున్నాయి. యువత , విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంపై ఈ రెండు పార్టీల మౌనం రాజకీయంగా పలు అనుమానాలకు తావిస్తోంది.సాధారణంగా ప్రతిపక్షాలకు యువత, విద్యార్థి వర్గాల మద్దతును పొందేందుకు ఇలాంటి జాతీయ స్థాయి వివాదాలు ఒక పెద్ద ఆయుధంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా బీజేపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రాంతీయ పార్టీలు ముందంజలో ఉండాలి. కానీ, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ రెండూ కూడా జాతీయ స్థాయిలో విపక్షాల కూటమి పిలుపునిచ్చిన నిరసనలకు భౌతికంగా, ఉధృతంగా మద్దతు తెలపకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహంతో పాటు కేంద్రం పట్ల ఉన్న భయాందోళనలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందిగ్ధ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకత్వం పట్ల ఈ పార్టీలకున్న వినూత్నమైన అభద్రత. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత, అసెంబ్లీ ఓటమి అనంతరం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీజేపీతో అనధికారికంగా ఒక వ్యూహాత్మక శాంతి ని పాటిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాన్ని లేదా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను నేరుగా టార్గెట్ చేస్తే టీఎంసీ లాంటి పరిస్థితులు రావొచ్చని సందేహిస్తున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉంది. గత ఐదేళ్ల పాలనపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు విచారణలకు ఆదేశిస్తున్న తరుణంలో, కేంద్రంలోని బీజేపీ పెద్దల ఆగ్రహానికి గురైతే పార్టీ మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. అందువల్లనే, కేంద్ర విద్యాశాఖ , మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే విషయంలో వైఎస్సార్‌సీపీ చాలా అప్రమత్తంగా, పరిమిత వ్యాఖ్యలకే పరిమితమవు



తూ, వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు వెనుకాడుతోంది. విద్యార్థుల భవిష్యత్తు ఎటుపోయినా పర్వాలేదు కానీ, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు మాత్రం కేంద్రాన్ని ప్రశ్నించరు అంటూ రేవంత్ రెడ్డి టార్గెట్ చేస్తుండటంతో, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది. తమ స్వయంకృత అపరాధాల వల్ల వచ్చిన కేసుల భయంతోనే బీఆర్ఎస్ నోరు మెదపడం లేదని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అందుకే మొక్కుబడిగా జంతర్, మంతర్ దగ్గర బీఆర్ఎస్వీతో నిరసనలు చేయిస్తామని ప్రకటించారు. సుదీర్ఘ కాలంలో ఈ తరహా మౌనం ప్రాంతీయ పార్టీలకు పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది. రాబోయే కాలంలో నిరుద్యోగిత, విద్యార్థుల సమస్యలు, రిక్రూట్‌మెంట్లు ప్రధాన రాజకీయ అంశాలుగా మారబోతున్న తరుణంలో, యువతకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఇది కాంగ్రెస్‌కు విద్యార్థి, యువజన ఓటు బ్యాంకును మరింత బదిలీ చేసేందుకు దోహదపడుతోంది. కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం పట్ల ఉన్న భయం, రాజకీయంగా వ్యూహాత్మకంగా సైలెంట్‌గా ఉండాలనే నిర్ణయం వల్లనే బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీలు జాతీయ స్థాయి ఆందో ళనలకు దూరంగా ఉంటున్నాయి. ఈ వ్యూహం ప్రస్తుతానికి తమపై కేంద్ర సంస్థల దాడులు పడకుండా కాపాడుకోవడానికి ఉపయోగపడవచ్చు ఏమో కానీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులను, యువత మద్దతు కోల్పోయే ప్రమాదాన్ని ఈ ప్రాంతీయ పార్టీలు స్వయంగా తెచ్చిపెట్టుకుంటున్నాయని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# కొత్త స్మార్ట్ రేషన్ కార్డులపై కీలక ప్రకటన




హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాత కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు కోటి మందికి పైగా లబ్ధిదారుల కుటుంబాలకు డెబిట్ కార్డు సైజులో ఉండే పీవీసీ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ పారదర్శకమైన ఆధునిక కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలతో పాటు లబ్ధిదారుల వివరాలు ముద్రించి ఉంటాయి. ఆగస్టు మాసంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న ఈ కార్డుల పంపిణీ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సరుకులు అందనున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అధునాతన సేవలను సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేకంగా కోరుతున్నారు

ఈ కేవైసీ పూర్తి చేయకుంటే రేషన్ కార్డులు రద్దు

ప్రభుత్వం అందిస్తున్న ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు ప్రతి ఒక్కరికీ అందాలంటే కుటుంబంలోని సభ్యులందరూ తక్షణమే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేయడం అత్యంత ముఖ్యం. ఐదేళ్లు నిండిన ప్రతి లబ్ధిదారుడు తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఒకవేళ వేలిముద్రలు పడని వృద్ధులు లేదా అనారోగ్యంతో ఉన్నవారు మీసేవా కేంద్రాల ద్వారా ఐరిస్ వెరిఫికేషన్ చేయించుకోవడానికి పూర్తి అవకాశం కల్పించారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయని వారి పేర్లు లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించబడతాయి. దీనివల్ల భవిష్యత్తులో సబ్సిడీ బియ్యంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ప్రభుత్వం హెచ్చరిస్తోంది.

సొంత ఊళ్లకు వెళ్లకుండానే సమీప రేషన్ షాపులో కేవైసీ

ఉపాధి నిమిత్తం సొంత ఊళ్లను వదిలి పట్టణాలు లేదా నగరాల్లో నివసిస్తున్న ప్రజలు ఈ కేవైసీ కోసం సొంతూళ్లకు వెళ్లాల్సిన అవసరం లేదు. పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం ఎక్కడ ఉంటున్నామో ఆ ప్రాంతానికి దగ్గర్లోని రేషన్ దుకాణానికి వెళ్లి ఉచితంగా ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు.

# రాజకీయాలకు సిద్ధప్ప గుడ్ బై

బెంగళూరు, జూలై 27, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య ప్రత్యక్ష ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. 2028లో జరగబోయే కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. నేటి రాజకీయం తీవ్రంగా కలుషితమైందని, అవినీతిమయంగా మారిన ప్రస్తుత రాజకీయ వాతావరణంలో నిజాయితీతో కూడిన రాజకీయానికి స్థానం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండ్య జిల్లా కేఆర్ పేట్‌లో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఆ తర్వాత సోషల్ మీడియా ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు.వయస్సు పైబడటం, ఆరోగ్యం క్షీణించడం కూడా తన నిర్ణయానికి ప్రధాన కారణాలని సిద్ధరామయ్య వివరించారు. ప్రస్తుతం తనకు 79 ఏళ్లు ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వ పదవీ కాలం ముగిసేసరికి తనకు 81-82 ఏళ్లు వస్తాయని పేర్కొన్నారు. గతంలో ఉన్నంత శారీరక సామర్థ్యం, ఉత్సాహంతో పని చేయడం ఇకపై సాధ్యం కాదని ఆయన తెలిపారు. వరుణ నియోజకవర్గ ప్రజలు మళ్లీ పోటీ చేయాలని తనపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని గట్టి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.గత కాలపు రాజకీయాలను గుర్తుచేసుకుంటూ.. ఒకప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తే నియోజకవర్గ ప్రజలే డబ్బులు ఇచ్చి గెలిపించేవారని, కానీ నేడు గెలవాలంటే ప్రజలకే డబ్బులు పంచాల్సిన పరిస్థితులు దాపురించాయని సిద్ధరామయ్య ఆవేదన చెందారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా ప్రారంభమైన తన 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో గెలుపోటములను చూశానని, అయితే ఎన్నడూ తన సిద్ధాంతాలకు, అంతరాత్మకు విరుద్ధంగా



ప్రవర్తించలేదనే సంతృప్తి తనకు ఉందని వ్యాఖ్యానించారు. 2028 నాటికి తన రాజకీయ జీవితం అర్ధ శతాబ్దం పూర్తి చేసుకుంటుందని సిద్ధరామయ్య తెలిపారు. ఎన్నికల బరి నుంచి తప్పుకున్నప్పటికీ, రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ ప్రజా సమస్యలపై తన గొంతుకను వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గత ఐదు దశాబ్దాలుగా కర్ణాటక ప్రజలు తనను తమ కుటుంబ సభ్యుడిగా ఆదరించారని, వారి రుణం తీర్చుకోవడానికి తన శేష జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. పూర్తి కాలం సీఎంగా కొనసాగాలనుకున్న ఆయనకు హైకమాండ్ షాకిచ్చింది. డీకే శివకుమార్ ను పదవిలో కూర్చోబెట్టారు

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140